జ్వాలా దహనమేంటి(రా ? లంకాదహనంలా. ఈ మధ్య హరికథ లేవయినా వింటున్నావేంటి ?

(అడిగిన వాడెవడో, వాడి యెక్స్ప్రెస్సేమిటో అప్రస్తుతం.)

"శ్రీశ్రీ రాసిన పరమేష జూకాలా ?"

"కాదు."

"ఆడాళ్ళ జూకాలా ?"

"అంతకంటే కాదు."

"మరయితే ఏమిటీ కథ ?"

"కథ కాదు, వ్యథ"

"ఏమిట్రా నీ గొడవ ?"

"గొడవ కాదు, గోడు."

"ఎప్పుడూ అలవాటులేనిది సూటిగా యేదవక యీ దొంకతిరుగుడు మొదలెట్టేవేంటీ ?"

# జూకాదహనం

## ఆకెళ్ళ కృష్ణమూర్తి

"ఏర్వవిండు, ఏర్వనిండు అని కృష్ణ శాస్త్రి ప్రాధేయపడిన రోజులు పోయాయి. ఇది మండు వేసవి. కన్నీటి యెద్దడి."

"మీ మనవడన్నదే రైటు లాగుంది. 'తాతగారికి తలకాయ లేదు, గుండేకాని!'"

"అంతేనా?"

ఈ సంభాషణ ప్రారంభించిన వాడికి 'అర్థము' అంటే అసలు. 'పరమార్థము' అంటే వడ్డీ. ఐదువేలు అప్పిచ్చి, పది వేలకు నోటు రాయించుకొని, వడ్డీరూపేణా పదిరెట్లు రాబట్టుకొని నోటు డబ్బు కోసం అరెస్టు వారెంటు పుట్టించగల నిష్కామ క్రియాశీలి. నాతో మాట్లాడం గిట్టుబాటుగా లేదని వాడి దారిన వాడు పోయాడు.

వాడికి రెవెన్యూ స్టాంప్‌లతోనూ, సాక్షి సంతకాలతోనూ, పోకెట్ కాల్క్యులేటర్ తోనూ, బ్యాంకు లాకర్లతోనూ, యినుప బీరువాలతోనూ, ఊళ్ళో కరెంటు పోయినా యింట్లో దీపాలారిపోకుండా ఉండగలందులకు సొంత జనరేటర్‌తోనూ (దొంగల మొహాలు కనబడ్డానికి), కూడా పనిచేసే సహచరుల నిరంతర దారిద్ర్యంతోనూ, హెడ్డుకానిస్టేబులు గారితోనూ, మేజిస్ట్రేటుగారితోనూ జీవితాంతమూ పనుంటుంది. దేవుడు కనిపిస్తే హారతి కర్పూరం కొనుక్కొందుకు అప్పడగడానికి దర్శన మిచ్చాడేమోనని హడిలి పోతాడు వాడి ద్వారా 'విధి' మన జీవితాలతో చెలగాట మాడి, ఓడిపోయిన మన మొహాలు వాడి పోయేలా కసిరి కొడుతుంది. మీ కు తెలియదు వాడు పెద్ద అభ్యుదయ వాది. (అభ్యుదయం అనే సరికి వెనుకటి కొకాయనకు 'అబ్బో! దయ్యం' అని వినిపించిందట).

జాఘూర్ల శాస్త్రిలా యిదంతా యెందుకు చెప్తున్నానంటే మావాడి అభ్యుదయ తత్వ విచారణా వివరం తమకు తెలియగలందులకు.

రావలసిన వడ్డీ బకాయిలు (అసలు చెల్లించేస్తానంటే కస్సున లేస్తాడు సుమా!) సకాలంలో వసూలయ్యాక, రాకేశ్ శర్మ మొదలైన వ్యోమగాముల్లా మావాడు భార రహితస్థితికొచ్చేస్తాడు. అప్పుడు, ముద్ద గుమ్మలూ, కప్పురపు విడెములూ, తూగు టూయెలూ అక్కర్లేకుండానే అభ్యుదయ కవిత్వ ధోరణి దొర్లిస్తాడు.

అటువంటి సచ్చిదానంద స్థితిలో ఒక మాటు "జాతిపిత" (అప్పుడప్పుడు 'జాతి పీత' అనడం కూడా కద్దు) అంటే 'మంద బాబు' అనీ, అందువలన జాతిపిత పేర వెలసిన మా కాలనీకి "మంద బాబూరు" అనీ వ్యుత్పత్త్యర్థం చెప్పేడు; కాదు, ఆంధ్రీకరించాడు!

మాది ఏశాఖలోని 'మందబాబూరు' నా పేరు ఏ. ౧. శర్మ—ఇందులో తిర కాసేం లేదు. నా పూర్తి పేరు 'అణగారిన వేతన శర్మ'

రావి శాస్త్రిగారి వేతన శర్మను నమ్ము కొన్న వాళ్ళకు వెతలుంటాయి. మరినేనో! నమ్ముకొన్న వాళ్ళ వల్ల వెతల పాలయిన యాతన శర్మను.

మాది ప్రభుత్వ రంగం. అంటే— అందులో ఉద్యోగం. చిన్నప్పుడు మాకు తెలిసినది నాటక రంగం. అంతకు వేయి రెట్లు రక్తి కట్టించగల ప్రభుత్వ రంగం ఆ తరువాత ఆవిర్భవించింది. ఇది వచ్చి బూటక రంగం; కపట నాటక రంగం. ఇలా యెందుకుందని ప్రశ్నించే అమాయ కుల యెముకల్ని నుసిచేసే రుద్రభూమి.

మూడు దశాబ్దాలుగా యీ ప్రభుత్వ రంగానికి వెళ్తూ, వస్తూ ఉండగా, నానాటికీ అదేమిటో అంతుబట్టక పోతుంటే ఒక మాటు మా అభ్యుదయ వ్యాపారియేమన్నా డంటే:

"ఒరే చవటా!" (అది అష్టోత్తరంలో వస్తుంది). వేల కొద్దీ జీతాలు లాగే కొంత మంది అధికార్లు పబ్లిగ్గా తమ తమ ప్రైవేటు వ్యాపారాల వేటసాగించే చోటునే



పబ్లిక్ సెక్టార్ అని యింగ్లీషులో అంటా(రా" అని నిర్వచనాత్మకంగా ప్రబోధించాడు.

పూలన్ దేవీలూ, హాజీ మస్తాన్లూ, ఈ పబ్లిక్ సెక్టార్ ముందు బలాదూర్ ఇక్కడ మా అధికార్లకు సర్వసంహారాధికారం మరియూ సర్వ స్వాహాధికారం (కొంతమంది తెలియని వాళ్ళు సర్వం సంహాధికారమని రసాభాస చేస్తారు) కలిగి, కృష్ణధన చైతన్యాన్ని (నల్లడబ్బు) అపారంగా సృష్టించి, మినిస్టర్ ఫర్ పావెర్టీకి (దాన్నే ఆర్థిక మంత్రి అనికూడా పిలుచుకోవచ్చు) అందని వేరొక ఆర్థిక వ్యవస్థను సృష్టించుకొని వోట్ల వేలంతో ప్రజాస్వాములై, ప్రతీ క్షణం మనకు రామరాజ్యం చూపిస్తున్నారు. (ఈవాస్తవాలు తెలియకపోతే కథే లేదు).

ఇటువంటి సుస్థిరమైన రామరాజ్యమంటే యేమిటో తెలియని మూర్ఖులు కొందరున్నారు. హిందీ, పంజాబీ, తమిళ, మళయాళ భాషలు తప్ప తెలుగుమాట వినిపించని తెలుగుదేశంలోని 'విశాఖ స్టీల్ ప్లాంట్' నీ, విశాఖ సిటీ బస్సుల్నీ, పబ్లిక్ రంగ రంగస్థలాలనూ, విద్యా సంస్థలనూ, వీటిలో వేటిని చూడగలిగినా ఒకే మాటుగా ఒకే వేటుగా యీ రామరాజ్య సందర్శనం పూరాగా అయి తీరుతుంది.

నేనిలా ఆలోచించుకుంటూ కూచుంటే కాళ్ళమీద పడుతుంది సిటీ బస్సులో ప్రయాణం చేసినా మృత్యుంజయుడనై యిప్పటి వరకూ బయట పడుతున్న నేను బస్సెక్కి గాజువాక పోవాలి. అక్కడ్నించి క్రోసెడు దూరం నడిస్తే కొండల ధ్య కాకతీయ విద్యాలయానికి శంఖుస్థాపన జరుగుతోంది. విద్యామంత్రి మహా సందేశం వినిపిస్తారు. వీలయితే (సాధారణంగా అవదు- అయినా ఆశచావదు), ఆయన్ని కలిసి నాగోడు వినిపించుకోవాలి.

తల వేలేసుకొని, కాళ్ళీడ్చుకుంటూ, బాధ రొదచేయగా, పట్టుదల పీడించగా, వెనకనించి యెవరో యీడ్చి తన్నుతూ, తోస్తూ నడిపిస్తున్న వాడిలా, విధిలేక సాగుతున్నాను.

తాగడానికి గుక్కెడు నీళ్ళయినా దొరకని రోజుల్లో కూడా సంతత ధారాపాతంగా పొంగి పొర్లే కంపెనీ వాటర్ ట్యాంకు

వరకూ వచ్చాను. ఆ ట్యాంకు గోడల నిండా రంగు రంగుల రాతలు.

"ఆర్ష ధర్మ పరిరక్షణకై వద్మం;" "శ్రామిక జన స్వర్గానికి సుత్తి, కొడవలి నక్షత్రం;" "మరచిపోకు నేస్తం! ఇదే అభయ హస్తం;" "ఆరుకోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం .. ". అంటూ రకరకాల రాతలు. ఓటులాగి వోటరు మహాశయుడ్ని కాటేసి వాటర్ మహాశయుడిగా మార్చగల అమృతమైన ఆదర్శాల వెకిలిరాతలు.

దశలువారీగా వీళ్ళందరికోసమూ పని చేసి యాతనశర్మగామిగిలిననేనుముందుకు సాగేను. కిల్లీ కొట్టుదాటాక తలెత్తి చూస్తే 'విద్యా గ్యాస్ సెంటర్' అన్న బోర్డు కనిపించింది. 'గ్యాస్‌కు విద్య విశేషణమై పోయిందేంటా' అనుకొంటూ పోయి ఆర్. టీ. సీ. వారి మర భోషాణంలో బలవంతంగా దూరేను.

"పదండి! పదండి ముందుకు!" అంటూ మా సిటీ బస్సు కండక్టర్లు నిరంతరం శ్రీశ్రీ గేయపఠనం చేస్తారు. కుళ్ళినచేపల యింపైన కంపు ఒకడి చంక కిందనుంచి మరొకడు తప్పని సరిగా దూరుతూ ఆఘ్రాణించే ఖరీదులేని ఘర్మజలాల పరీమళాలు. ఒంటికాళ్ళమీదనిలబడ్డం 'అరె. నా రెండో కాలేమయింది? కాదు, కాదు! నాకిప్పుడు నాలుగు కాళ్ళొచ్చాయి.' అనే విపరీతానుభూతి ముందు త్రొక్కిసలాటలో సిగ పట్లు పడుతూ అగచాట్లులో ఉన్న స్త్రీల నానుకొని కులాసాగా ప్రయాణం సాగిద్దామనుకొని, మనకాళ్ళ సందుల్లోంచి రాకెట్లలా ముందుకు దూసుకు పోయే బస్సు రోమియోల వికారాలు. 'డ్రైవరు గారూ! బస్సాపండి! నా పర్సు కొట్టేసాడు' అనే కేకలు మొదలుగాగల చిత్ర విచిత్రాలు మా సిటీ బస్సుల గుత్తాధిపత్యంలో ఉన్నాయి.

మన జాతీయగీతంలో 'ఆంధ్ర' శబ్దం లేదు. అందుకే కాబోలు గాజువాక జంక్షన్ దాటి బాల చెరువు రోడ్డులో యితర రాష్ట్రాల వాళ్ళ 'విశాఖ స్టీల్ ప్లాంట్' వైపు నడిస్తే ఛంబల్ వ్యాలీ తాలూకు జనమూ, సంత్ భింద్రాన్ వాలేను మరిపించే సిక్కు గెడ్డాలూ, తమిళ, కేరళ సాంప్రదాయాలూ. మనకు చోటీయక ఆంధ్రుల ఆత్మ గౌరవం యెక్కడుందో వెతుక్కోమని సవాల్ చేస్తాయి.

చేయని నేరానికి 'నిన్నెందుకు డిస్మిస్ చేయకూడదూ?' అని పేలిపోయే ఛార్జ్ షిట్‌లా యెండ దంచేస్తోంది.

అవతల మంత్రి పుంగవులు. మనస్సులో బాధ. ఇరవై రెండేళ్ళు పెంచిన మా గారాలపట్టి. నడిస్తే హంస. పలికితే చిలక. అందరికీ తలలో నాలుక. విప్పు లాంటి పిల్ల. పొగజారి బొగెపోయింది. తండ్రీ! మా విద్యాశాఖ దాన్ని ముద్ద చేసి మింగేసింది బాబోయ్! మనస్సులో అగ్ని గోళాల సుడులు రేగుతున్నాయి. చెప్పుకోవాలన్న తాపత్రయం.

"నాండీ! నా బతుకెందుకిలా కాలిపోయింది? కరస్పాండెంటంటే మీ ఉద్యోగం కాదు గదా! మార్చేసుకున్నారుగా. మీ ఉద్యోగానికీ దీనికీ సంబంధమేమిటి? మిమ్మల్ని డిస్మిస్ చేస్తామన్నారా? మన గతేంటి?" కె. జి హాస్పిటల్‌లో మా అమ్మాయి ఆవేదన, మరణ వేదన.

వెళ్ళాలి. బాధ వెళ్ళ బోసుకోవాలి. నడుస్తూనే ఉన్నాను. అలా క్రోసెడు దూరం కదిలింది.

వెనుక నాక కొండ. కుడి, యెడమల చెరోకొండ. పొయ్యి రాళ్ళలా పేర్చినట్లున్నాయి మూడుకొండలూ. కొండలనడుమ విశాలమైన జాగా. అందులో మధ్యగా పెద్ద పెద్ద షామియానాలు. ఎత్తుగా వేదిక. ఎదురుగా యెన్నో కుర్చీలు. అన్నిటిలోనూ సంతుష్టాంతరంగం బహిరంగంగా ద్యోతకమయ్యే అర్ధిక స్తోమతగల పెద్దలు.

స్టేజిమీద మరీ పెద్దలు, సుఖాసీనులై సభ వంకా, ఉపన్యాసకుని వంకా సాధికారంగా దృక్కులు సారిస్తున్నారు.

రైల్వే స్టేషన్లవద్దా, విమానాశ్రయాల వద్దా, గవర్నరు బంగళాలోనూ, తదితర చోట్లా, మంత్రి వర్యులను కలవడానికి తాపత్రయ పడే 'దండా, పండూగాళ్ళలో రెండు తరహాల వాళ్ళను యెన్నోసార్లు గుర్తు పట్టేను. (ఆ మంత్రి హడావిడిగా బాత్‌రూమ్‌లోకి బొత్తాలు సర్దుకుంటూ పారి పోతున్నా సరే, వీళ్ళు మాత్రం అదే మీ పట్టించుకోకుండా మంత్రి మెడలో హడావిడిగా ఒక దండవేసి, చేతులో ఒక పండు పెట్టి, బైటకుపోయి "మంత్రిగారితో మాట్లాడేను. ఇండస్ట్రియల్ కోలనీలో మీరుంటున్న యిళ్ళన్నీ మీకే యిచ్చేస్తామని హామీ యిచ్చారు. ఆ పి ఏ. గాడికి నోట్ చేసుకోమని స్పెషల్‌గా చెప్పేరు" అంటూ కోతలు కోసే రాజకీయ జేబు దొంగల్ని మా ఊళ్ళో "దండా, పండూ గ్యాంగ్" అని ఆప్యాయంగా పిలుచుకుంటాం). సాధారణంగా, దొంగ వెధవలూ, వెర్రివెధవలూ మంత్రుల చుట్టూ తిరుగుతారని ఒకరచయిత అభిప్రాయం.



కలవారు చేసే కళ కళలాడే పాపాల్లా గుట్టలు గుట్టలుగా పూలదండలు. నేను బాగా వెనుకగానున్న కుర్చీలో కూలబడ్డాను. ఒక ప్రొఫెసరుగారు మాట్లాడుతున్నారు. ఆయన చాలా బాగా మాట్లాడుతున్నారని పించింది.


"విద్యాభోగకరీ, యశస్సుఖకరీ"వంటి శ్లోకాల్లో "దివ్యనిగూఢవిత్తము....." గుప్తమగు 'విద్యలేనివాడు వింత పశువు" (విద్య గల్గిన వాడు వంత పశువు-అంటే పాలకవర్గానికి వంతపాడి వత్తాసు పలికే అరిన వత్తి శాబోలు) వంటి పద్యాలూ ధారాపాతంగా విన వచ్చాయి.

అయితే, ఆ వింత పశువు దగ్గఱ నా బుర్ర నిలబడి పోయింది. తరువాత మొత్తమంతా మూగ సినిమా అయిపోయింది. కొద్దిసేపట్లో సభాసదులూ మాయమై పోయారు. మంత్రిగారితో సహా స్టేజి మాయమైంది....

నేను హైదరాబాద్ ఎయిర్ పోర్టులో దిగేను. విమానం లోంచి దిగుతుంటే నా ప్రతి కదలికలోనూ గర్వం తొణికిసలాడింది. "హుఃః నేను సాధించబోయే ఘన కార్యం నీకేం తెల్సుః" అన్నట్లు డ్యూటీకోసం దణ్ణం పెడుతున్న ఎయిర్ హోస్టెస్ వైపు చూసేను. కాబూలీవాడి దగ్గర అప్పుచేసిన డబ్బుతో అర్జెంటుగా విమానం మీద ప్రయాణంచేసి మా"మంద బాబూరు హైస్కూలును" జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయించాలి అందులో యింగ్లీషు మీడియం ఉండాలి. పైన్సు కోర్సులు కూడా ఉండాలి. అప్లికేషన్ యిచ్చిన మర్నాడే నా పని పూర్తికావాలి.

అప్పటి డైరెక్టర్ అఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ని కలిసేను. నాటి విద్యాశాఖామాత్యులను కలిసేను. సాయంత్రం 6 గంటలుదాటి పోయింది సెక్రటేరియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ టైపిస్టు యెప్పుడో వెళ్ళిపోయాడు. తలావులు మూస్తున్న ప్యూన్‌గారి కాళ్ళు పట్టుకున్నాను. ఆయన నా జేబులు తడిఁవేఁదు టైపిస్ట్ వైనం చెప్పి తాను నేనొచ్చేవరకూ అక్కడే ఉండడానికి అంగీకరించాడు.

టైపిస్ట్‌గారు సెక్రటేరియట్ ఆవరణ లోని కో-ఆపరేటివ్ స్టోర్సు వద్ద కోటా బియ్యం కోసం పెద్దసైజు క్యూలో వెనగ్గా




నిలబడి బక ధ్యానం చేస్తున్నారు అప్పుడా స్టోర్సు వాళ్ళనీ. క్యూలో వాళ్ళనీబతిమాలు కొని టైపిస్టుగారి కోటా బియ్యం టైపిస్ట్ గారికిప్పించి. ఆయన అప్పటికీ నా పట్ల ప్రసన్నుడు కాకపోతే వారి ముప్పై కేజీల మూటా నేనే మోసి మా హైస్కూలును జూ. కా. (జూనియర్ కాలేజీ-ఆ తరువాత జాన్వర్ కాలేజీ అని కిట్టని వాళ్ళంటే అనొచ్చు గాక)గా అప్ గ్రేడ్ చేస్తూ యిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారి ఆర్డర్లను సైక్లో స్టయిల్ చేయించి పట్టుకొచ్చాను.

తిరిగి వచ్చేటప్పుడు. విమానంలోని కాక్‌పిట్‌లోంచి. మెలికలుతిరిగి చచ్చిపడి ఉన్నట్లు కనిపించే పెద్దసైజు పాము లాంటి గోదావరినదిని చూసేను భూదేవి ముఖం మీద మొటిమలవంటి కొండలు చూసేను. ఎవరు చూద్దం లేదుకదా అన్న ధీమాతో నిర్భరంగా. నీలంగా. తీరుబడిగా. తీరాన్ని కెరటాలు కెరటాలుగా ముద్దెట్టుకొంటున్న సముద్రుడ్ని చూసేను. మబ్బుల్లోంచి దూసుకుపోతున్నప్పుడు గతుకుల్లోపడుతూ. లేస్తూ నడిచే రెండెడ్ల బండిలా సాగింది విమానం.

ఇంటికొచ్చి నావీపు నేనేతట్టుకున్నాను. నన్ను నేనే మెచ్చేసుకున్నాను. నాలోనేను గంతులేసేను. మాహైస్కూలు జూ. కా. అయిపోయింది.

"వాడి ఫ్రెండూ. కులంవోడూ. హెడ్మాస్టరు గారి పతిని ప్రిన్సిపాల్ చెయ్యడం కోసమే యీ వెధవ నానా గడ్డీ కరిచాడు. బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు" అని పిల్లల రాజకీయ తండ్రులంతా సంక్లిష్ట సత్య శోధనా ఫలితాలను కోడై కూసేరు. ఈ డిస్కవరీని వీలయినంత మందిమెచ్చుకొన్నారు.

తమ కులం తప్పించి మిగతాకులాలనన్నింటినీ నిర్మూలించి తీరాలన్న కార్యదీక్షాపరులైన కుల నిర్మూలనా సంఘాల వారందరూ "అంతే! అంతే! వీడి కుల తత్వ కాలేజీ నశించాలి!" అని నినాదాలు చేసేరు.

'ఇల్లూ. వొళ్ళూ గుల్లచేసి లోకం మరామత్తుకు సిద్ధపడ్డ అప్రయోజకుడు వీడు. వీడి వల్ల మన చేతికి చిప్పే!' అని యింట్లో వాళ్ళంతా యీసడించుకొన్నారు.

చచ్చి చెడి, యం. ఏ., యం. యస్. సీ., లు ప్యాసయిన కొందరు కుర్రాళ్ళు జూనియర్ లెక్చరర్లుగా అవతరించారు. అందులో, "యెందుకయినా మనం పనికి రాలేకపోము. ఈ రొచ్చుగుంటలో మనకేం పని?" అని కొందరు మా జాన్వర్ కాలేజి ఉద్యోగం మానుకొని మరోచోటికి పోయారుట. (దేశో విశాలః, ప్రభువో హ్యనంతైః).

జూ. కా. జూ. లె. (జూనియర్ లెక్చరర్లు) కి బి యిడి., మేస్టర్లంతా నాల్గో తరగతి పౌరులుగా అనేరు. నిన్ననే పదో క్లాసుప్యాసయి యీవేళ యింటర్మీడియేట్‌లో చేరిన విద్యార్థులందరూ హైస్కూల్ స్టూడెంట్లను 'భోత్రాల్లా' చూద్దం మొదలెట్టేరు. ఇంగ్లీషు మీడియం కుర్రాళ్ళకి తెలుగు మీడియం వాళ్ళు గులాబీ పువ్వు మీద పాకే గొంగళీ పురుగుల్లా గోచరించారు.

## కొత్త ప్రయోగం

# వ్యథానిక

శ్రీ ఆకెళ్ళ కృష్ణమూర్తి 'కాల్పనిక సాహిత్యం అంతా వాస్తవ జీవితాన్ని అతి పేలవంగా అనుకరిస్తూ పోయేది' అని అంటారు. విశాఖ వాస్తవ్యులు. షిప్‌యార్డ్ కాలనీలో నివాసం. ప్రస్తుతం మన దేశాన్ని శాతవాహనుల దుష్టపరిపాలనలో వున్నదనీ (స్పార్టకస్ తెలుగులో రాసిన ఆనాటి రచయిత)

శాత = Percentage or spoils or 'the cut'

వాహన = Vehicle used by the Misruler

ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండా యీ నిగూఢ గూఢ దుర్మార్గపు వ్యవస్థని అభిమన్యు డిల్లా ఎదుర్కొంటే విషాదాంత డాన్‌క్విగ్జట్ అవాలి ఎవడయినా అంటాడీ రచయిత.

ఈ క్రింద మీరు చదవబోయే 'వ్యథానిక' అన్యాయానికి వ్యతిరేకంగా ఒకడు పడిన వాస్తవమైన అవస్థ! ఈ వ్యథానిక ఆకెళ్ళ కృష్ణమూర్తి మానస పుత్రిక.

కొత్త ప్రక్రియల్ని సమాదరించే ప్రఖ్యాతిగల ఆంధ్రజ్యోతి పాఠకులు ఈ కథపై తమ అభిప్రాయాలను, విమర్శలను నిర్మొహమాటంగా రాస్తారని ఆశిస్తాము!

—ఎడిటర్

హైస్కూలు మేస్టర్లుగా ఉంటూ జూనియర్ లెక్చరర్లయిన వాళ్ళకీ, డైరెక్టుగా జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగాలు సంపాదించుకొన్న వాళ్ళకీ మధ్య గ్రూపులేర్పడ్డాయి

బోధనా పద్ధతులలో శిక్షణ లేని లెక్చరర్లు మర్కట కిశోరన్యాయం పాటిస్తే, అటువంటి శిక్షణ గల బి యిడి., మేస్టర్లు మార్జాల కిశోర న్యాయంలో నడుస్తారు.

దీనికి తోడు మా ఊళ్ళో వీధులు తుడిచే ఆడ స్వీపరు గార్నీ, గుళ్ళో గంట వాయించే పిలక పూజారి గార్నీ చూసి కళ్ళల్లో కారం జల్లుకొనే విద్యాధికులైన ఉన్నతోద్యోగులు కూడా ఉండటం చేత సర్వే సర్వత్రా యీర్ష్యా, ద్వేషాలు, కుట్రలూ, కూహకాలుగా రూపు దిద్దుకుంటూనే ఉంటాయి.

అరెరె! మళ్ళీ ఉపన్యాసం వినిపిస్తోందేమిటి చెప్మా! "గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః" అంటూ విశిష్ట గురుత్వం గురించి ఉపన్యాసకుడు విశ్లోకిస్తున్నాడు...

ఇంతలో నా మనస్సు తిరిగి పరుగులు తీస్తోంది.... మా జూ. కా. గురువులు (అది నామవాచకం కాదు) చాలా మోడరన్‌గా ఉంటారుట. ఒక నాడో కవి నాయకుడు (అంటే విద్యార్థి నాయకుడు) సురాధ్యానం (దీన్నే కొందరు చేత కాని వాజమ్మలు సురాపానం అంటారు) కోసం ఒక బార్‌లోకి వెళ్ళేడుట.

అక్కడ దీపాలు కావాలని మసకగా వెలుగుతాయి. టేబుళ్ళూ, కుర్చీలూ, మనుషులూ నీలోటిలో కనిపిస్తారు సీసాలూ, గ్లాసులూ ఉన్నాయేమోననిపిస్తవి. అందరూ నెమ్మదిగా నే మాట్లాడుతున్నామనుకుంటారు. సోమయాజి కానివాడికిమాత్రం చెవులు బద్దలై పోతాయి. ఒక్క టేబులు దగ్గర మాత్రమే యిద్దరే ఉన్నట్లు అనేవు. మన వినాయకుడు ఆ టేబులు దగ్గరకెళ్ళి కుర్చీ లాక్కుని కూచున్నాడు. బేరర్ని బీరు తెమ్మన్నాడు. టేబులు దగ్గర గొంతుకలు రెండూ సపరిచితమైనవిగా ధ్వనించాయి. మైకంతో మొఱుగుతున్నాయి. తేరబారి చూచాడు, జూ. కా. కరస్పాండెంటూ, ప్రిన్సిపాలూ గగన విహారఘోషలో ఉన్నారట. దానితో మన విద్యావిధానానికి సంపూర్ణ ప్రాతినిధ్యపాటవమూ, సమగ్ర స్వరూపమూ, రెండుచెట్టా పట్టాలు వేసుకొని తూలుకుంటూ వచ్చేసేయట

చెప్పడం మరచిపోయాను జూ.కా. కాక పూర్వం యీ హైస్కూల్లో చదివే విద్యార్థులు జిల్లామొత్తంవిద్యార్థిలోకంలో శ్రేష్ఠులనే భావం ఉండేది. 'ఫలానా హైస్కూల్లో చదువుతున్నాన'ని ప్రతీ విద్యార్థి సగర్వంగా చెప్పుకునేవాడు (ఆ గర్వానికి పతనం తప్పదు గదా! ఆ పతనం జూ కా. అయాక సాధించడం జరిగింది).

కాని, నేడో! ఎక్కడా సీటు దొరక్కపోతే యీ జూ. కా. లో చేరడం. చేరిన వారం పదిరోజులలో టీ. సీ. పుచ్చుకొని సిటీ యెక్కి నచ్చినచో జేరడమూ జరుగుతోందట.

జూ కా. లో యేడవతరగతిలో నూటికి 16 మందీ [16%], పదో క్లాసులో నూటికి 16 మందీ [16%], యింటర్‌లో నూటికి 16 మందీ [16%] చెక్కు చెదరకుండా స్టాండర్డ్‌గా ప్యాసవుతారట.

ఇక్కడ, పాఠాలు చెప్పే మేస్టర్లని, క్లాసు మొహం చూడ్డానికి యిష్టపడని కొందరు విశిష్ట గురువులు, స్కూల్లోనే కొట్టిస్తారట—కుర్రాళ్ళచేత. దెబ్బలు తినగల శక్తి ఉడిగి, మేష్టరు, "రోడ్ల మీద ముష్టెత్తుకునైనా బతుకుతాను. లేకపోతే ఛస్తాను. అంతేకాని నేనీ దెబ్బలు తినలేకుండా ఉన్నాను బాబో!" అని రాజీనామా యిస్తే, "వీడు పరీక్షలకు పాఠంగా వెళ్ళడానికి భయపడుతున్నాడు. దెబ్బలు తినలేనంటున్నాడు. తీసి పారెయ్యండి." అని యాజమాన్యంవారు క్రమ శిక్షణను కట్టుదిట్టం చేసి పారేసేరట.

"నువ్వు ఫైనల్ మార్కుల లిస్టులివ్వలే దానితో పరీక్షా ఫలితాలు పకటించడంఆలస్యమైపోతుంది. ఏమిటిసంగతి?" అని ఒక మేష్టార్ని సంజాయిషీ అడిగితే, "అయ్యా! తమరు ఫలానా ఆడ మేష్టార్ని క్లాస్ రూంలోనే, ఒళ్ళో కూర్చోబెట్టుకుని బయాలజీ ప్రయోగాలు బోధిస్తుంటే నేను చూసేనన్న కోపంకొద్దీ, ఆవిషయంబయట పడకుండా ఉండగలందులకు నాకీ సంజాయిషీ నోటీసు జారీ చేసేరే కాని మరేమీ కాదండయ్యా! మీకా సంకోచమేమీ అక్కర్లేదని" ఆయన అతివినయం ఒలకబోసి మనవి చేసుకున్నారట దాంతో యిన్‌చార్జ ప్రిన్సిపల్‌గారు ఆయన్ని దయతలచి మానవతాసదుద్దేశ్యంతో "క్షమించాం. వెళ్ళండి." అన్నారుట. ధర్మప్రభువులు. [ఇంకెప్పుడూ




అలా చూడొద్దని చెప్పేరో లేదో నాకు తెలియంలేదుట) వేసవి సెలవుల్లోదాదాపు మూడ్నెల్ల ముచ్చటగా కరస్పాండెంటు గిరీ గౌరవపదవిగా వెలగబెట్టుకొని వెల్ల గిల బడ్డ నాకు—

"గురుర్బ్రహ్మః, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః. గురురాద్వైశ్య గేయంచ, తస్మై శ్రీ గురవేనమః." అన్నట్లుగా వినబడుతున్నదా శ్లోకం.

మళ్ళీ మైకులోంచి 'కొఠారీ కమీషన్' గట్రా ఎట్సెట్రా మాటలు వినిపించాయి. మన విద్యాబోధన మాతృభాష లోనే కొనసాగాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు. విద్య వ్యాపారమై పోరాదని వాపోతున్నారు. (విద్య వ్యభిచారమే సాగిపోతుంటే ఇంత తక్కువ చేసి మాట్లాడుతున్నారేమిటా ? అనిపించింది) విద్య యొక్క సామాజిక అవసరాన్ని గుర్తించి తీరా అంటున్నారు. [ఈ మధ్య సామాజిక అడవుల పెంపకం గురించి రేడియోలు బిద్దలు కొట్టేస్తున్నాయి. మనం నివసిస్తున్నది సామాజిక కీకారణ్యమనీ. మన గోడు మనతో సహా మరెవరికీ వినబడదనీ మరచి పోతున్నారు.]

అప్పుడు విద్యామంత్రిగారు నిలు వెత్తునా రాజీవితో నిలబడ్డారు. నాకు బలే సరదా అయిపోయింది. ముందు మాటాడి దిగిపోయిన ప్రొఫెసరుగారి ఉపన్యాసాన్ని దూదేకినట్లు యేకిపారేసే సంకల్పంతో నిలబడ్డారు. తెలుగును ఇంగ్లీషులా వాయిస్తున్నారు.

1858లో మెకాలే [మృగాలేకి వికృతి మెకాలే కాబోలు! అవి ఇప్పుడూ, ఎప్పుడూ ఉన్నవే కదా! ప్రత్యేకించి 1858 మృగాల ప్రసక్తి దేనికో ? మట్టి బుర్ర ! లార్డ్ మెకాలే యేమో !] ప్రవేశ పెట్టినది మన విద్యా విధానమని ఖచ్చితంగా చెప్పేసేరు విద్యా విధానంతో చీటికీ మాటికీ గోటీకాయ లాడ్డం నిషేధించామని సెలవిచ్చారు. ఏడాదికొక విద్యాకమీషన్ వేసేమనీ ['చాలా చోట్ల మేష్టర్ల బదిలీల కోసం యేడాదిలో చాలా మార్లే కమీషన్లు కొట్టేస్తున్నారు కొందరధికార్లు' అని మేష్టర్లు గోల పెడుతున్నారట]. యిప్పటికి కనీసం వెయ్యిరిపోర్టు లయినా తయారయి బూజును పెంచుతున్నాయనీ. ఆ రిపోర్టులకు పట్టిన బూజునూ దుమ్మునూ దులపడానికి యెన్నో కోట్ల రూపాయలు యీ మధ్యనే మంజూరు చేసేమనీ. అవన్నీ మనకెందుకనీ తేల్చే సేరు. విద్యార్థులలో క్రమ శిక్షణా రాహిత్యం పెరిగి పోతోందన్నారు. విద్య 'డైనమిగ్గా' 'ప్రోగ్రెసివ్' గా ఉండాలని వాక్రుచ్చారు. వృత్తి విద్యా విధాన నిర్ణయం కోసం హైదరాబాద్‌లో అదరా బాదరాగా ఉన్నతాధికార శిఖరాగ్ర సమావేశమొకటి జరగబోతోంది. ఖంగారు పడ వద్దని భరోసా యిచ్చారు.

ఇంత వరకూ ఫ్లూటు వాయించినట్లనిపించింది. జలతరంగిణి మ్రోగించినట్ల యింది. కాని, యింకొక్క మాట చాలా గట్టిగా చెప్పేరు. దానితో నా కడుపులో దేవినట్లయింది. మెదడు మీద సమ్మెట పోట్లు పడ్డాయి. గుండెలు పిండినట్ల యింది.

"అయితే, యీ పవిత్ర లక్ష్య సాధన కోసం ప్రభుత్వానికి పూర్తి ప్రజాసహకారం కావాలి ప్రతి ఒక్కరూ నడుం కట్టి సిద్ధం కండి" అన్నారు.

కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. అమెరికా, రష్యాల అంతరిక్ష నౌకలన్నీ నా బుర్రలో కక్ష్యలు తిప్పి కక్షతో ఢీ కొట్టుకున్నట్ల యింది. "వెర్రి వెధవనై ప్రభుత్వానికి సహకారం యివ్వడం వల్లనే నా ముద్దుల మూడోకూతురు పల్లకాల్లో కలిసిపోయింది బాబోయ్ !" అని అరవాలనిపించింది. (దాని యం.ఏ. పరీక్ష, వైభవంగా చేయాలను కొన్న దాని పెళ్ళి, దాని రంగుల కలలు అన్నీ కాలుకు చచ్చిపోయాయి మొర్రో! అని యేడవాలనిపించింది)

"ప్రభుత్వం యిచ్చిన తాఖీదును అమలు పరచడం వల్లనే జూ. కా. గుమాస్తా గాడి ఉద్యోగం యేడాది క్రింద ఊడిపోయింది నాయనో! వాడి భార్యా, అయిదుగురు పిల్లలూ ఆకటి చీకటి చిచ్చులతో నిరాహారం వండుకొని అభోజనం ఆరగిస్తుంటే మీ ప్రభుత్వం యేం చేస్తోంది మహా ప్రభూ!" అని నిలదీసి అడగాలనిపించింది.

"మాలాటి వోటర్లందరినీ- మీకు సహకారమిచ్చిన నేరానికి- ఒక్కొక్కరినే తమరు మాడ్చి చంపితే తమ, తమ పార్టీలకు వోట్లు వేసే ఛోటా గాళ్ళు తగ్గిపోయి తమకు వచ్చే వోట్లు పల్లకాల్లో రాలిపోతాయి." అని కేకలేద్దామనిపించింది ..

ఇంతలో మళ్ళీ కె. జి. హాస్పిటలు. సర్జికల్ వార్డు. కాళ్ళు కోసి నరాల్లోకి సెలైన్, డెక్స్ట్రోజ్. కడుపుకోసి మూత్రానికి ఒక గొట్టం. ఆక్సిజన్ సిలెండరు. ముక్కులోకొక గొట్టం. "నాందీ ! [నా ఆఖరి కూతురు, బిడ్డ, మా అందరికీబహిః ప్రాణం దానికి నాలుగేళ్ళున్నప్పుడు నేను డిఫెన్స్ ఆఫ్ యిండియా రూల్సు క్రింద ముషీరాబాద్ జైల్లో ఉంటే, వెంటనే యింటికి వచ్చేయ్యమని రాయించిన నా ముద్దుల పట్టి. మాటలు వచ్చినప్పటి నుంచీ ఆఖరి శ్వాస పీల్చేవరకూ, నన్ను నాన్నగారండీ అనడం బదులు 'నాందీ' అని పిలిచేది. ఏండీ ! యేం చెప్పమం

టారు?]" మీకెందుకిలా అయింది ? ఆ కాలేజీ గొడవ మనకెందుకు ? అనవరీ పోసుకు, అసలుద్యోగానికిముడి పెడుతున్నా రెందుకు?" ....

అవునమ్మా అవును! నాకెందుకిలా అయింది? ఎందుకు? ఎం...దు...కు? ఎందు కంటే

మా జూ. కా కి ఒక అరవావిడను ప్రిన్సిపాల్ చేద్దామనుకున్నారట అందుకి గౌరీపతి మేష్టారడ్డను కొన్నారట. ఆ గొడవ రాజుకుని, రాజుకొని చివరకు నా యింట్లో సజీవ దహన కాండకు తోవ తీసింది.




"నాలుగు గ్రోసుల సుద్ద ముక్కలు కొన్నట్లు రాసి, రెండున్నర గ్రోసులే కొన్నాడట". "పుస్తకం మీద ఖరీద యెనిమిది రూపాయలని ఉంటే దాన్ని దిద్ది పదిరూపాయలు చేసేడట." "మేగ్‌జైన్‌లో వెయ్యాల్సిన బ్లాకులు నాలుగు చేయించా నని రాసి మూడే బ్లాకులు చేయించి ఒక బ్లాక్ డబ్బు దొబ్బేసేట్ట." "ఎకౌంట్లు సరిగ్గా లేవుట; ఆడిట్ చేయించలేదట [మరిప్పుడు మూడేళ్ళనుంచి అసలు ఎకౌంట్లే లేకపోతే అడిగినవాడి కూతురు చచ్చిపోవాల్ట; వాడి ఉద్యోగం పీకేయాల్ట].

ప్రభుత్వంజోక్యం చేసుకొని, "నగరు ఆరోపణలు వాస్తవంకాదనీ, స్పెషల్‌ఫీ ఎకౌంటుకూ విద్యా సంస్థల ప్రైవేట్ మేనేజ్ మెంటుకూ సంబంధం లేదనీ, ప్రిన్సిపాల్‌గా తీసేసిన తారీఖునుంచీ వెంటనే గౌరీపతిమేష్టార్ని తిరిగి ఉద్యోగంలో వేసుకోవాలనీ" దఫ దఫాలుగా ఆదేశాలిచ్చిందిట

జూ. కా. కరస్పాండెంట్‌గా ఉన్నాయన ససేమీరా మేం వీడ్ని తిరిగి పనిలోకి తీసుకొనేది లేదు, పొమ్మని భీష్మించుకొని కూచున్నాట్ట.

ఆ కరస్పాండెంట్‌ను ప్రోసెక్యూట్

దీపావళి శుభాకాంక్షలతో!

ఆత్మీయతతో కూడిన

ఆతిథ్యానికి, రుచికీ, పరిశుభ్రతకు

ఫోన్ : 20034

ఆనందభవన్ హోటల్

ఫౌండర్ :
ఎస్. రామస్వామి

బ్రాడీపేట, మెయిన్‌రోడ్,
గుంటూరు-2.




చేస్తామనీ, గ్రాంట్లాపుతామనీ ప్రభుత్వం వారు బెదిరించారుట.

దానితో. ప్రభుత్వం మీద కరస్పాం డెంటాదులు హైకోర్టులో, వ్యాజ్యం వేసే రట. కోర్టువారి నిర్ణయం వ్యాజ్య కారులకు రుచించ లేదట. గౌరీపతిని తిరిగి ప్రిన్సి పాల్‌గా వేసుకోవలసి వస్తుందేమోనని భయపడ్డారుట.

యాజమాన్యం వారికిష్టమైన కరస్పాం డెంటును రక్షించుకొందుకూ, గౌరీపతినీ వేతన శర్మనీ [యిద్దరిలో యెవరన్నా యిష్టం లేదు కనుక] యిద్దరినీఒకే దెబ్బకు రాల గొట్టవచ్చుననీ సామ, దాన మా యోపాయాలతో యాతన శర్మగాడ్ని కర స్పాండెంటన్నారట.

మంత్రిగారి ప్రభుత్వం, 'అరబదు చులను కాపాడి తీరుతామని' ప్రతిజ్ఞలు బూనిన ప్రభుత్వం, నెలాఖరులోగా గౌరీ పతిని తిరిగి ప్రిన్సిపల్‌గా ఉద్యోగంలో వేసుకొని, అలా చేసినట్టు మాకు వెను వెంటనే రిపోర్టు దాఖలుచేసుకోవలసిందిగా నాకు తాఖీదిచ్చారు.

"వాళ్లేమన్నారో మా కనవసరం. గౌరీ పతిని తిరిగి ప్రిన్సిపాల్‌గా వేసుకోవడం కలలోని మాట. పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకు" అన్నారు జూ. కా. యాజ మాన్యం వారు.

అప్పుడు నాకు విశ్వనాథ వారు "వేయి పడగలు" లో యీ విద్యాసంస్థల యాజ మాన్యపు కమిటీలతో పడ్డ అవస్థ ప్రత్య క్షంగా యెదురయింది. ప్రైవేటు యాజ మాన్యాల విద్యా వ్యభిచార విరాడ్రూప సందర్శనం అయింది.

అయితే, యిందుకు కూడా చట్టాలేడుస్తు న్నాయి. సామాన్యుడ్ని కుది మట్టంలోకి అణగ గొట్టినా యీ చట్టాలు ఒక వట్టాన కదిలిరావు. అయితే, కరస్పాండెంటుగా, సామాన్యుడ్ని కనుక చట్టం ప్రకారం ప్రభుత్వ దొరతనం వారితో విధిగా సహకరించాను. గౌరీపతిని తిరిగి ప్రిన్సి పాల్‌గా వేసినట్లు ఉత్తర్వులు జారీ చేసి వారి ఆజ్ఞప్రకారం వారికి తెలియబరచాను.

గొడవ ముదిరి, ముదిరి నాఉద్యోగానికి యెసరు బెడుతున్నట్లు ప్రచారం సాగింది. అందరూ మొండి వాళ్లే అయితే యీనాడు పాలిస్తున్న తరాజులు యేనాడో కాల గర్భంలో కలిసి పోదురు.

ప్రచారానికి నా మూడో కూతురు భయపడి పోయింది. కాల్చుకుంది. చచ్చి పోయింది.

అది గేయాలు రాసేది దానికి బంధువు లంతా కావాలి. స్నేహితులంతా సుఖంగా ఉండాలి. గొడవల్లేని ప్రశాంతత కావాలి. దాని పందొమ్మిదవ యేట అది రాసిన గేయ భాగం చిత్తగించండి.

"నా విశిధపు గదితో
ఒంటరిగా నేను
మిణుగురునై వెలిగానో క్షణం ;
కొలను గట్టున
యే కాకినై నేను
కలువనై వికసిం నో క్షణం :
ఈ లోకపు రాక్షస గొడవలో నేను
కోయిలనై ఆలపించానో క్షణం....."

ఇప్పటికే పెళ్ళిళ్ళు చేసి అప్పులపాలై, లోకం మరమ్మత్తులో వ్యధార్త జీవినై, ఆలిబిడ్డల పవస్థలపాలు జేసిన నేను, ఉద్యోగం ఊడితే "ఇంక పెళ్ళేం చేయ గలడు? నాగతేమి కాను? వీడికి నాబరు వెందుకుండాలి?" లాంటి వేదనా భరితమైన ప్రశ్నలు దాని సున్నితమైన మనస్సును కొరికి పారేసేయి; నమిలి మింగేసేయి.

ప్రభుత్వానికిచ్చిన సహకారం దాన్ని దహించేసింది. జూ. కా. దాన్ని దహించే సింది.

ఇంక రెండు గంటల్లో మమ్మల్ని తీవ్ర విషాద నిషాద నిస్వనంలో లీనం చేసే ముందు యీ జూ. కా. మా పాలిట రాక్షస కరాళ దంష్ట్రా సరీసృపమై యెలా విషం జిమ్మిందో, అగ్ని జ్వాలల బుసలు కొట్టిందో మా బంగారు తల్లి నాతోచెప్పిన విషయాలేవీ, నాభార్యతో సహా, నేనెవరికీ యిప్పటి వరకూ చెప్పలేదు.

రావి శాస్త్రి గారు వ్రాసినట్లు రామచిలుక కాలిపోయింది. మా బంగారు బొమ్మ మాడి బొగ్గైపోయింది మా మనపల ముద్దుల పిన్ని మంట గలసి పోయింది. 1942 క్విట్ యిండియా ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిని, మహాకవి శ్రీశ్రీ (నాఆరాధ్యదైవం) చెప్పినట్లు

"వస్తే రానీ, కష్టాల్, నష్టాల్.
వస్తేరానీ,
పోతేపోనీ, సతుల్, సుతుల్, హితుల్
పోనీ ..."

అన్న పట్టుదలతో, బియ్యానికి టికానా లేని రోజుల్లో జొన్నన్నం తిని బ్రతికిన వాడ్ని, చేతనైన విధంగా అన్యాయాన్ని వ్యతిరేకించిన యీ దెబ్బకు తట్టుకోలేక పోయానా ?


అయినా,

"పలికించకు మౌన మృదంగాలను,
కదిలించకు సుప్త భుజంగాలను,
కెరలించకు శాంత తరంగాలను," అని

నా సహజ ధోరణిలో హెచ్చరిస్తున్నాను.

"ఏఁవండో మంత్రిగారూ! ఇంకా మీకు మా సహకారం కావాలా? ఇహ నాకు మిగిలిందేమిటి నా ప్రాణంతప్ప? ఇదిగో? కావాలంటే తీసుకోండి." అని కేకలేసేనట.

మా ఆవిడ లేపింది. "ఏమిటండీ




అంతలా పలవరిస్తున్నారు? అంత పీడకల కనుక వస్తే "దూర్వాసదుస్స్వప్న నాశనం" అనే శ్లోకాన్ని పూర్తిగా చదువుకొని ఒక పచ్చ గడ్డి పరక తెంపి పారెయ్యండి" అంటూ, నా వైపు అనుమానంగానే చూసింది.

అవును. ఇది కలే. కలకానిదేది? వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రులవారితో "నాయనా! శ్రీరామచంద్రా! సంయక్ జ్ఞానాన్ని సాధించు. ఇతః పూర్వము బ్రహ్మయే [విరాట్టు] లేదు. ఇదంతా మాయ."

"ఉద్వస్తమ సదా భాసముత్పన్న నగరోపమమ్
వర్షప్రోన్మృష్ట చిత్రాభాం జగత్ప శ్యత్యవాసనః."

"వాసనా రహిత్యము వలన జీవన్ముక్తి లభిస్తుంది. జీవన్ముక్తునకు యీ జగత్తు నశించిన దానివలెనూ, అసత్యముగనూ, వర్షం కురువగా తుడుచుకు పోయిన చిత్రము వలెనూ గోచరిస్తుంది."

"కోట్ల కొలది తుషారా బిందువులు కూడితే మేఘమేర్పడింది. ఆ నీటిబిందువులే లేకపోతే ఆ మేఘము లేదు. అలాగే, వాసనలూ, సంస్కారములూ, సంకల్పములూ కలిస్తే మనస్సేర్పడింది. వాసనాదిరాహిత్యమయాక ఆ మనస్సేదీ? లేదు. ఇదంతా మాయ; అన్నారట.

మరేం? ! సీత మాయ. లేడి మాయ లంకానగరం మాయ. రావణుడు మాయ. ఆ తరువాత ధుర్యోధనాదులు మాయ. శ్రీకృష్ణుడెప్పుడూ మాయే. ఆ ధర్మానికి వ్యతిరేకంగా సాధుజన సంరక్షణార్థమై దేవుడెత్తిన అవతారాలన్నీ మాయ. కనుక, ప్రభుత్వమూ మాయే.

అయితే, మంత్రిగారన్న సహకారం యిచ్చిన నాకు జరిగిన యీ పుత్రికా వియోగ విషాద నిశీధి—అదెప్పుడుమాయ మౌతుందో?

✱


నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి!

చర్మవ్యాధులనుండి విముక్తులు కండి!

హస్తప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్కలనము, అంగము చిన్నదగుట, అపపరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స!

పోస్టు ద్వారా చికిత్స కలదు!

క్యాంపులు : ప్రతి ఆదివారం "భీమవరం" షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6-30 గం॥ వరకు ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు.



డా॥ డి. మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్సు & స్కిన్ స్పెషలిస్ట్

పార్కు రోడ్, గుడివాడ-521 301.

ఫోన్స్ : 522 & 540